నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | నవంబర్ 29, 2024 | www.navatelangana.com

రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

నవతెలంగాణ-భిక్కనూర్ (రాజంపేట్)

మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్, పోస్టాఫీస్ ప్రాంతాలలో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. బ్యాంకు, పోస్టాఫీస్‌కు వెళ్లే ఖాతాదారులు, కాలనీ వాసులు మురికినీటి వాసనతో అనేక ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు తెలిపారు. గ్రామపంచా యతీ అధికారులు స్పందించి మురికి నీరు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ పనులు వేగంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులలో నాణ్యత లోపించకుండా చేయాలని సూచించారు. బస్టాండ్ లేకపోవడంతో స్థానిక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, త్వరతగతిన పనులను చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శీను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్


మాట్లాడుతున్న సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా..

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- వెంటనే పేదలకు పంపిణీ చేయాలి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మారాయని, వాటిని వెంటనే పూర్తి చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త కలెక్టరేట్ పక్కన ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉండటంతో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని గత దశాబ్ద కాలంగా పేదలు ప్రభుత్వానికి, అధికారులకు అనేకమార్లు దరఖాస్తులు పెట్టుకొని విన్నవించుకున్నప్పటికీ వాటిని పూర్తి చేసి పంపిణీ చేయలేకపోయారని, దీనివలన అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయని అన్నారు. ప్రధానంగా నాగారం ప్రాంతంలో 396 ఇండ్లు పూర్తయి నాలుగు సంవత్సరాలకు పైగా అయినప్పటికీ వాటిని పేదలకు పంచకుండా కాలయాపన చేయటంతో పాటు కలెక్టరేట్ వద్ద ఉన్న 252 ఇండ్లను 60 శాతంపైగా పూర్తి చేశారని, కొద్దిపాటి నిధులను కేటాయిస్తే వీటిని కూడా పంపిణీ చేయటానికి అవకాశం ఉన్నప్పటికీ నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వం నిర్లక్ష్యంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న కిటికీలు, అద్దాలు, తలుపులు, కరెంటు వైర్లు, తదితర అన్ని ధ్వంసం చేయటం వాటికి సరైన నిఘా లేకపోవడంతో ప్రజలకు ఉపయోగపడకుండా మారాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన నిధులను కేటాయించి యుద్ధ ప్రాతిపదికన వాటి మరమ్మతులు చేపట్టి వాటిని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని లేనియెడల ప్రజలు వాటిని తమ నివాస ప్రాంతాలుగా మార్చుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నిర్మాణంలో జరిగిన లోపాలను సరిదిద్దాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్, విగ్నేష్, నగర నాయకులు నల్వాల నరసయ్య, దినేష్, చక్రి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : చెవిలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫుడ్ పాయిజన్‌పై ప్రభుత్వం స్పందించాలి

- చెవుల్లో పూలతో ఎస్ఎఫ్ఐ నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్/డిచ్‌పల్లి

రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక నాందేవ్‌వాడలో చెవుల్లో పూలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో, రెసిడెన్షియల్ గురుకులాలలో, కేజీబీవీలలో ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే విద్యార్థులకు నాసిరకం భోజనాలతో విరేచనాలై ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడలో విద్యార్థినీ మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి జిల్లా అంతటా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేశ్, చక్రీ నగర ఉపాధ్యక్షులు ఆజాద్, నాయకులు సుశాంత్, అనిల్, సాయికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో, రెసిడెన్షియల్ గురుకులాలలో, కేజీబీవీలలో ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు శివ అన్నారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లా కాలేజ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సరిత, భవాని, సాగర్, వేణు, హరీష్, గణేష్, భానుప్రసాద్, రాకేష్, వంశీ పాల్గొన్నారు.


పనులను ప్రారంభించి మాట్లాడుతున్న డిపో మేనేజర్ సరిత

ఎవ్వరికీ ఇబ్బందిలేకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం

- పనులు ప్రారంభించిన డీఎం

నవతెలంగాణ-పిట్లం

ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో కాలనీవాసులు కొందరు అక్కడక్కడ అక్రమ నిర్మాణాలు, గోడలు, కాంపౌండ్ వాల్ నిర్మించినప్పటికీ ఎవ్వరికీ ఇబ్బందులు కలగకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్టు బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి వెల్లడించారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పోలీసుల బందోబస్తు మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సరిత దేవి ఆధ్వర్యంలో 1 ఎకరం 40 గుంటల భూమి కల్గిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మండల సర్వేతో కొలతలు చేయించడంతో కాలనీవాసుల ఆర్టీసీ సిబ్బంది మధ్య కొంతమేరకు వాగ్వివాదం జరిగినప్పటికీ అక్రమ నిర్మాణాలు, గోడలను కూల్చలేక ఆర్టీసీ సిబ్బంది వెనుకకు తగ్గి ఎవరికి ఇబ్బందులు లేకుండా పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి 30 లక్షల ఆర్టీసీ నిధులతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏఈ సూర్య, సివిల్ ఇంజనీర్ శ్రీకాంత్, స్థానిక కంట్రోలర్ సాయిలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వేయాల్సింది ఓ చోట

వేసింది మరోచోట

- చేప పిల్లల విడుదలలో అధికారుల ఇష్టారాజ్యం
- నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్న పలువురు మత్స్యకారులు



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ మాసాని చెరువులో విడుదల చేయాల్సిన చేపపిల్లలను అధికారులు రఘునాథ చెరువులో విడుదల చేశారు. అయితే న్యాల్‌కల్ చెరువుకు మూడు సొసైటీల సభ్యులతో సంబంధం ఉందని.. రఘునాథ చెరువుకు ఒక సంఘం వారికే సభ్యత్వం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని న్యాల్‌కల్ మాసాని చెరువులో సభ్యత్వం కలిగిన మత్స్యకారులు అంటున్నారు.

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

న్యాల్‌కల్ మాసాని చెరువులో న్యాల్‌కల్, వీక్లీ బజార్, గాజుల్‌పేట్ (బోయగల్లి) సొసైటీలకు సంబంధించిన మత్స్యకారులకు సభ్యత్వం ఉంది. కానీ నగరంలోని (ట్యాంక్‌బండ్) రఘునాథ చెరువులోకి మాత్రం గాజులపేట్ (బోయగల్లి)కి చెందిన మత్స్యకారులకు మాత్రమే సభ్యత్వం ఉంది. వారు మాత్రమే చేపలను పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని మాసాని చెరువులో సభ్యత్వం కలిగిన మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. దాంతో న్యాల్‌కల్, వీక్లీ బజార్‌కు చెందిన మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. అంతేకాకుండా న్యాల్‌కల్ చెరువుకు 2 లక్షల పైచిలుకు చేపపిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది. అయినా ఒక్క లక్ష 37వేల చేప పిల్లలను రఘునాథ చెరువులో విడుదల చేశారు. న్యాల్‌కల్ చెరువులో కాకుండా రఘునాథ చెరువులో చేప పిల్లలు పంపిణీ చేయడంతో సుమారు 380 మంది సొసైటీ సభ్యులు నష్టపోతున్నట్టు మత్స్యకారులు చెబుతున్నారు. న్యాల్‌కల్ చెరువులోనే చేప పిల్లలను పంపిణీ చేసి ఉంటే న్యాల్‌కల్ (150 మంది మత్స్యకార సభ్యులు), వీక్లీ బజార్ (230 మంది మత్స్యకార సభ్యులు), గాజులుపేట్ (320 మంది మత్స్యకార సభ్యులు) ఈ చెరువులో చేపలు పట్టుకునే అవకాశం ఉండేది. కానీ రఘునాథ చెరువులో విడుదల చేయడంతో వీరందరూ నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మత్స్యకారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చేప పిల్లల పంపిణీలో ఆలస్యం..

వాస్తవానికి జూన్, జులైలో పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను అక్టోబర్, నవంబర్‌లో పంపిణీ చేయడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని మత్స్యకారులు అంటున్నారు. ఆలస్యంగా పంపిణీ చేయడంతో చేప పిల్లలు పెరగడానికి సమయం పడుతుందని అంటున్నారు. బొచ్చ, రవ్వాట, మెరుగు వంటి చేపలను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలి. కానీ పాంప్లెంట్ అనే కొత్త రకం చేపను భారీ మొత్తంలో పంపిణీ చేయడంతో అవి ఎదిగాక విక్రయిస్తే ప్రజలు వాటిని కొనుగోలు చేయడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

డైరెక్టర్ల నిర్ణయం మేరకే పంపిణీ

మత్స్యకారుల సంఘం డైరెక్టర్ల నిర్ణయం మేరకే తాము చేప పిల్లలను విడుదల చేశాం. రఘునాథ చెరువులో విడుదల చేయాలని డైరెక్టర్లు నిర్ణయం చేసి తమకు నివేదిస్తే తమ ఫీల్డ్‌మెన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశాం.

– నిజామాబాద్ ఎడిఎఫ్ డి.ఆంజనేయస్వామి

అధికారుల ఇష్టారాజ్యం..

నిబంధనల మేరకు చేప పిల్లల పంపిణీ చేయాల్సి ఉండగా.. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక చెరువులో విడుదల చేయాల్సిన చేప పిల్లలను మరో చెరువులో విడుదల చేయడంపై మత్స్యకారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా.. చేప పిల్లల పంపిణీలో సైతం నాసిరకమైనవి పంపిణీ చేస్తుండటంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఉపాధికి నష్టం చేకూర్చకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులకు కోరుతున్నారు.


ఫీల్డ్‌మెన్ ఆధ్వర్యంలో చేపపిల్లలు పంపిణీ (ఫైల్)

డాటా ఎంట్రీలో తప్పులుండొద్దు

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే డేటా ఎంట్రీ వివరాలను తప్పులు లేకుండా వేగవంతంగా నిర్వహించే విధంగా మానిటరింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాల యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమగ్ర సర్వే డేటా ఎంట్రీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమగ్ర సర్వే వివరాలను ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆన్లైన్ నమోదును వేగవంతం చేసేవిధంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లను ప్రోత్సహించాలని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ డాటా ఎంట్రీకి అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్‌లను ఎక్కువగా నియమించుకోవాలన్నారు. సర్వేలో సేకరించిన సమాచారం ఫారాలను భద్రపరచాలని తెలిపారు. మండల స్థాయిలోని డేటా ఎంట్రీ వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఓ రాజారాం, కామారెడ్డి మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, టౌన్‌ప్లానింగ్ అధికారి గిరిధర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

మరుగుదొడ్ల వివరాలు డిసెంబర్ 5లోగా సమర్పించాలి..

జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్, పరిశుభ్రమైన మరుగుదొడ్ల వివరాలు డిసెంబర్ 5లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్, పంచాయతీ, రైల్వే తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాన్యువల్ స్కావేంజర్, ఇన్సానిటరీ టాయిలెట్స్ వివరాలు ప్రభుత్వానికి సమర్పించవలసిన ఉందని, జిల్లాలోని పంచాయతీ, మున్సిపల్, రైల్వే పరిధిలో ఉన్నట్లయితే ఆ వివరాలు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి కార్యాలయానికి డిసెంబర్ 5లోగా సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, సి.పి.ఒ. రాజారాం, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టం కింద ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-రామారెడ్డి

మోసం చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మార్కంటి రాజకుమార్ (30) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను సంవత్సర కాలంగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి, శారీరకంగా వాడుకున్నాడు. ఇప్పుడు సంబంధం లేదని, పెళ్లి చేసుకోనని మోసగించాడని బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. సిఐ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిజామాబాద్ జిల్లాకు శుక్రవారం రానున్నారు. అందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, ఇందల్వాయి, ధర్పల్లి మండలాలలో పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతోందనే దానితోపాటు ఇతరత్రా అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

జిల్లాస్థాయి

చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం


గెలుపొందిన విద్యార్థినిలకు ప్రశంసపత్రాలు అందజేత

నవతెలంగాణ-నిజాంసాగర్

జనవిజ్ఞాన వేదిక కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో కామారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల పాఠశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలలో నిజాంసాగర్ మండలంలోని మల్లూరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. జెడ్.పి.హెచ్.ఎస్ తెలుగు మీడియం విద్యార్థులు (వి.అంజన సౌమ్య పదవ తరగతి, డి.భావన 9వ తరగతి, బి.మీనాక్షి 8వ తరగతి) మొదటి స్థానం సాధించి ప్రతిభ చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నిజాంసాగర్ మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. వారికి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ప్రశంస పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ చాలాన్ టెస్టు అనేది విద్యార్థుల సైన్స్‌పై అవగాహన, వారి ఆచరణాత్మక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సవాల్ చేసే, విద్యార్థులలో మూఢనమ్మకాలకు ఎలాంటి తావులేకుండా చేసే పోటీ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ

శివరాజ్ దేశాయ్‌కి కన్నీటి వీడ్కోలు

- అంత్యక్రియల్లో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసులు బాలరాజు, ఏనుగు రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండలం లోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివరాజ్ దేశాయ్, వారి కుమారుడు రాజు దేశాయ్ బుధవారం కారు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే గురువారం బస్వాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. శివరాజ్ దేశాయ్, వారి కుమారుని పార్థివదేహాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు, పోచారం సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. శివరాజ్ దేశాయ్‌తో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. శివరాజ్ దేశాయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం శివరాజ్ దేశాయ్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమ యాత్రలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.


పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న పోచారం

రైతు వేదికను పట్టించుకోరా..?

- పేకముక్కలతో దర్శనమిస్తున్న కల్దుర్కి రైతువేదిక

నవతెలంగాణ-బోధన్

రైతుల అవసరాల కోసం లక్షల రూపాయలు వెచ్చించి రైతువేదిక నిర్మిస్తే దానిని పట్టించుకునే నాథుడే లేరు. దాంతో రైతువేదిక దుమ్ము, ధూళి పేరుకుపోయి కళావిహీనంగా మారింది. బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన రైతు వేదిక రైతుల అవసరాల కోసం ఉపయోగించకుండా నిరుపయోగంగా మారింది. కనీసం రైతు వేదికను తెరవకపోవడంతో పేకాట ఆడేవారికి, మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతి రోజు ఏఈఓలు రైతువేదికలో కార్యాలయం ఏర్పాటు చేసుకుని విధులు నిర్వహించాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశించిన కల్దుర్కి క్లస్టర్ ఏఈఓ మాత్రం అదేమీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత ఏఈఓ రైతువేదికను రోజు తెరవరని అక్కడి రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైఆ సంబంధిత ఏఈఓ రైతువేదికను రైతులకు అవసరాలకు ఉపయోగపడేలా చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



నవతెలంగాణ
నిజామాబాద్
శుక్రవారం | నవంబర్ 29, 2024 | www.navatelangana.com

ఆరు గ్యారెంటీలపై పాట ద్వారా అవగాహన



నవతెలంగాణ-డిచ్‌పల్లి
ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా కళాయాత్ర ఇందల్ వాయి మండలంలోని గన్నారం, సంస్థాన్ సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లో ప్రజా పాలన ఆరు గ్యారంటీల పైన పాట మాట ద్వారా ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ద్వారా అయాగ్రామాలలో అవగాహన కల్పించినట్లు కళాకారులు సతీష్, నర్సయ్య, రాంపూర్ సాయి, తెలిపారు. కార్యక్రమంలో రషీద్, డప్పు రాజు, రవి నాయక్, సమతా, మనోజా, మీనా, కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి విద్యార్థిని



హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న వి. నేహా రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండంట్ బాలి రవీందర్ గురువారం తెలిపారు. ఈ నెల 19న కల్లెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నేహా జిల్లా జట్టుకి ఎంపికైనట్లు చెపాపరు.. ఈ నెల 29, 30, డిసెంబర్ 1 వరకు ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటల్లో జిల్లా జట్టు తరుపున నేహా పాల్గొటుందని తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ వాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని వి. నేహ తో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్‌ను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్
మండల కేంద్రంలో గురువారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన 20 మంది లబ్ధిదారుల కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు అయిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బద్దం నర్సారెడ్డి, కట్ట మహేష్, టి.సాయన్న, సాయిలు, జక్కుల శ్రీను, శ్రీనివాస్ గౌడ్, పూసవర్ల శ్రీనివాస్, చిన్న నర్సయ్య, శంకర్ పటేల్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..
టీజీ యండీసీ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్, యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాలా మోహన్ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం వేంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షులు చిన్న గంగారాం, గ్రామ యూత్ అధ్యక్షులు నరేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జక్క గంగాధర్, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు మల్లయ్య యాదవ్, సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన



వరి నరుమడులను పరిశీలిస్తున్న వ్యవసాధికారిణి రమ్యశ్రీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో కలిసి వరి నారుమడులను సందర్శించినట్లు మండల వ్యవసాయ అధికారిణి టి.రమ్యశ్రీ తెలిపారు. తమ సందర్శనలో భాగంగా వరి నారు ఎర్రబడుటను గమనించినట్లు చెప్పారు. యాసంగిలో తరచూ వరి నారు ఎర్రబరడం చూస్తుంటామన్నారు. దీనికి నివారణ చర్యగా రైతులు సాయంకాలం వేళలో తమ పంట పొలాల్లోని వరి నారు మడుల నుండి నీటిని తీసివేయాలని ఉదయం వేళ నీటిని అందించాలని అన్నారు. నారుమడి తయారు చేసేటప్పుడు ఎకరానికి సరిపడా నారుమడికి ఒక కిలో జింక్ సల్ఫేట్ వేయాలన్నారు. జింక్ సల్ఫేట్ వేసుకున్న మూడు నుండి ఐదు రోజుల తర్వాత దుక్కిలో 20-20-0 లేదా డిఏపి వేసుకోవాలని సూచించారు. జింక్, భాస్వరం కలిపి వేయడం వల్ల రసానిక చర్య జరిగి మొక్క జింక్ ను తీసుకోలేదన్నారు. ప్రధాన పొలం తయారు చేసుకునేటప్పుడు ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం మూడు నుండి ఐదు రోజుల తర్వాత 20-20-0 వంటి అడుగు మందు వేయాలన్నారు. వీలైన చోట నారుమడిని టార్ఫిలిన్ కవర్లతో కప్పే విధంగా ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. దీనివల్ల చలి తీవ్రత నుండి నారుమడిని కాపాడుకోగలుగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో పోచమ్మ బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని ఉప్లూర్‌లో గురువారం స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద పోచమ్మ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఇటీవల పెద్ద పోచమ్మ నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్టాపన జరిగిన నేపథ్యంలో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని కోషీర్ నుండి పెద్ద పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. పలువురు మహిళలు మంగళ హారతులతో మరి కొందరు మహిళలు నెత్తిన బోనాలతో పెద్ద పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తరలి వెళ్లారు. అనంతరం పెద్ద పోచమ్మ ఆలయం వద్ద అమ్మవారికి బోనాలను సమర్పించి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. గ్రామంలోని పిల్లా పాప, గొడ్డు గోదా, పాడిపంట బాగుండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆయా కుల సంఘాల పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ క్లాస్

నవతెలంగాణ-బాల్కొండ
మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్మూర్‌కు చెందిన ప్రముఖ మోటివేటర్ ఇరవత్రి మారుతి పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు మోటివేషన్ క్లాసు గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఇప్పుడున్న స్టేజి నుంచి ఉన్నత విద్య వైపు, జీవితంలో ఎదుర్కోవాల్సిన సవాళ్లను, తమ కెరీర్‌ను ఏ విధంగా మలుచుకోవాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాధ్యతతో వ్యవహరించినప్పుడే ఉన్నత రంగంలో రాణించడం చాలా సులువని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అందించాలి

ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్
పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రేమ్ కుమార్ అన్నారు.
పట్టణంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత నాణ్యమైన విద్య వైద్యం, ఉపాధి అందించాలని, ఎకరం భూమి, 200 గజాల్లో నాలుగు గదుల ఇల్లు అమలు అమలు చేయాలని పట్టణ కేంద్రంలో గల అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం తహశీల్దార్ గజానంద్‌కు మెమొరాండం అందజేశారు. ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రతిస్పందన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ సమాజ పార్టీ నాయకులు కాన్షిరం, మహేశ్, కిషన్, సాయిరాం, పరుష నితిన్, మండల కన్వీనర్ జైచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర హాస్టల్ సందర్శన

నవతెలంగాణ - భీంగల్ రూరల్
మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం ఎంపీడీవో సంతోష్ కుమార్ తనిఖీ చేశారు. పరిసరాలు, సౌకర్యాలు, పరిశుభ్రత, టాయిలెట్స్, భోజనం, కిచెన్, ప్రొవిజన్ స్టాక్, తాగునీరు, రూమ్స్‌లో లైట్, ఫ్యాన్ లాంటి ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. మెరుగైన వసతులు కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు.

ట్యాబ్ ఎంట్రీలో నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు

- బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావివ్వొద్దు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ట్యాబ్ ఎంట్రీలో నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. గురువారం మండలంలోని రాంపూర్(డి) గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రక్ షీట్లను తెప్పించుకోవడంలో, ట్యాబ్ ఎంట్రీలు చేయడంలో జాప్యం జరుగుతుండడాన్ని గమనించి కేంద్రం నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొన్న 48 గంటల్లో వారి ఖాతాల్లో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. బిల్లుల కోసం రైతులు నిరీక్షించే పరిస్థితి ఉత్పన్నం కాకుండా సత్వరమే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసేలా పర్యవేక్షణ చేయాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు బాధ్యతలు పురమాయించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల వివరాలను ఆరా తీశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు తరలించిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ రైస్ మిల్లుల వద్ద తరుగు పేరిట కోతలు విధించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా, వారు నష్టపోకుండా సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం తరలించిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తామని తెలిపారు.కలెక్టర్ వెంట సిఈఓ నాగరాజ్, నాగేశ్వరరావు, అధికారులు ఉన్నారు.

ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలి

ప్రతి రోజూ భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాలు నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని భోజనం వండిన తరువాత కూడా విద్యార్థులకు వడ్డించడానికి ముందు రుచి చూడాలని నిర్వాహకులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మండలంలోని రాంపూర్(డి) గ్రామంలోగల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. ఆహార పదార్థాలను భద్రపరచడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. నాసిరకమైన బియ్యం, నూనె, ఇతర సరుకులు సరఫరా జరిగితే వెంటనే తహసీల్దార్ దృష్టికి తేవాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రభాకర్, అధికారులు ఉన్నారు.

బాల్య వివాహ నిరోధక ఉద్యమం ప్రారంభం

- సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ మధుసూదన్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్
భారత ప్రభుత్వ బాల్య వివాహ విముక్త భారత్ పిలుపు మేరకు బాల్య వివాహ నిరోధక ఉద్యమాన్ని ప్రారంభించినట్టు సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ మధుసూదన్ గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు ఆపడానికి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అనే వేదిక 250 మంది ఎన్‌జిఒలతో ఏర్పాటు చేయడం అందులో సాధన ఒక భాగస్వామ్య సంస్థగా వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిజామాబాద్, నవీపేట్, బోధన్ (పెంట కలాన్, మావంది, బండారిపల్లి, అభంగపట్నం, ధర్మారం, పెగడపల్లి, మవాంధికాలన్, లంగ్డాపూర్) మండలాల్లోని 12 గ్రామ పంచాయతీలో కార్యక్రమాలను చేప్పట్టడం జరుగుతుంది అని తెలిపారు. కేంద్ర మహిళ, శిశు శాఖ మంత్రి అపర్ణపూర్ణ దేవి ఈనెల 27న ఢిల్లీలో లాంఛనంగా ఈ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. జాతీయ స్థాయి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ద్వాదిక వ్యవస్థాపకుడు బాలల హక్కుల కార్యకర్త భువన్ రివ్యూ తమ సందేశంలో బాల్య వివాహాలను అంతమొందించడానికి కృషి చేస్తామని తెలియజేసారు. ఈ సమస్య అధికంగా ఉన్న రాష్ట్రాలపై దృష్టి సాధించి 250పైగా ఎన్.జి.ఓ.లతో కలిసి, రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో అనేక కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. అందులో బాగంగా నిజామాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఈనెల 27న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, నిజామాబాద్ పాఠశాలలో జిల్లా అధికారులు డిఎల్ ఎస్ఏ, జిల్లా న్యాయ సేవాధికారులు పద్మావతి, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ కుమారి, శిశు సంక్షేమ అధికారులు, వివిధ బాలల హక్కుల వేదికతో కలిసి ప్రారంభించారన్నారు. అందులో భాగంగా అదే రోజు 12 గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారని, ఈ గ్రామాల్లో దాదాపుగా 400లకు పైగా ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిరోధించే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ సహకరించాలని ప్రచారం కల్పిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా వివరాలకై మధుసూదన్ సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ ను సంప్రదించాలని కోరారు. 9533639682 నెంబర్ కోసం సంప్రదించాలన్నారు.

కేజీబీవీ, గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

- యుఎస్ఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
కేజీబీవీ, గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్-యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని కేజీబీవీ, గురుకులాలు. సంక్షేమ హాస్టలల్స్ దాదాపు 150 వరకు ఉన్నాయని, వీటిలో 40 వేల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడే గదులు, హాస్టల్స్ కూడా లేవన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్స్, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్స్ ఉన్నాయని తెలిపారు. ఇటీవలే మృతి చెందిన వాంకేడి ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అక్కడ అందించే భోజనంలో నాణ్యతను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శులు సంతోష్, అజయ్, నగర నాయకులు విశాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల ప్రభుత్వం

కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల శ్రేయస్సు కొరకు పనిచేస్తుందని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండగ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నిటినీ అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్‌ను రైతుల ఖాతాలో జమచేసిందని తెలిపారు. ఇదివరకే రైతు రుణమాఫీ చేశామని, ఇంకా వివిధ కారణాలతో రుణమాఫీ కాకుండా మిగిలిన 4 లక్షల మంది అర్హులైన రైతులను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిందని, వారికి కూడా త్వరలో రుణమాఫీ చేస్తుందన్నారు. పంటకు పెట్టుబడి సాయంగా రైతు భరోసాను కూడా ఈ సంక్రాంతి పండుగ వరకు రైతుల ఖాతాల్లో జమచేస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 28 నుండి 30 వరకు రైతు పండగ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. ఈ నెల 30న మహబూబ్ నగర్‌లో భారీ రైతు బహిరంగ సభ ఉందని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి టి.మెర్సీ, సూపర్ వైజర్ రాజు, రైతులు సింగిరెడ్డి ప్రతాప్, వేముల గంగారెడ్డి, పాలెపు రాజేశ్వర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

పోటు ప్రసాద్ మరణం ఉద్యమానికి తీరని లోటు : సిపిఐ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పోటు ప్రసాద్ మరణం ఉద్యమానికి తీరని లోటని సిపిఐ నాయకులు అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో అమరులు పోటు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ఖమ్మం సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అమరులు కామ్రేడ్ పోటు ప్రసాద్ అకస్మాత్తుగా బుధవారం ఉదయం వాకింగ్ చేస్తుండగానే మరణించారన్నారు. రాష్ట్ర ఏఐఎస్ఎఫ్‌లో పనిచేసి విద్యార్థి ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోటు ప్రసాద్ కీలకంగా పనిచేశారని తెలిపారు. హైదరాబాదులో జరిగిన విద్యుత్ ఉద్యమం పోరాటంలో పోలీసుల దెబ్బలు, గుర్రాలతో తొక్కించి గాయపరిచిన రోజుల్లో ధైర్యంగా పోలీసులని ఎదుర్కొని అరెస్టయ్యారని అన్నారు. పోటు ప్రసాద్ నాయనమ్మ ఎర్రమ్మ తెలంగాణ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనితఅని, పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా పట్టుదలతో నిర్వహించిన ఉత్తమ కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని అన్నారు. పుస్తకాలు చదవడం, విషయాలపై అవగాహన పెంచుకోవడంలో మంచి అధ్యయనశీలి అని, సైదాంతిక సమస్య వచ్చినప్పుడు చాలా గొప్పగా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఇతరులకు చెప్పి ఒప్పించడంలో ఎంతో నేర్పరి అని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు బి.రఘురాం, రాజకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

30న వేసక్టమీ ఆపరేషన్లు

జాతీయ టీకా కార్యక్రమంపై శిక్షణ



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
కుటుంబ నియంత్రణ శాశ్వత పద్ధతుల్లో భాగంగా మగవారికి వెసక్టమీ ఆపరేషన్ డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ సామాజిక ఆసుపత్రిలో ఈనెల 30న వేసక్టమీ ఆపరేషన్ల శిబిరం ఉంటుందని తెలిపారు. ఈరోజే ప్రారంభించండి, కుటుంబ నియంత్రణ గురించి భార్యాభర్తలు మాట్లాడుకోవాలి" అనే శీర్షికన ఈ కుటుంబ నియంత్రణ వేసక్టమి ఆపరేషన్లు చేపట్టనున్నట్లు డాక్టర్ సుశాంత్ రెడ్డి తెలిపారు. ప్రతి ఆశా కార్యకర్త ఒక్కొక్కరిని తీసుకొని రావాలని, ప్రతి ఆరోగ్య కార్యకర్త ఒక్కొక్కరిని తీసుకొని రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వైద్యాధికారి తెలిపారు. గురువారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా టీకాల కార్యక్రమ ప్రణాళికపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటికీ తిరిగి గ్రామ ప్రజల వివరాలను సేకరించి అందులో గర్భిణీ స్త్రీ వివరాలను టీకాలకు అర్హులైన శిశువులు, పిల్లలను గుర్తించి వారిని వివిధ ఫారంలలో పొందుపరిచి ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రతి టీకా సెషన్‌లో ఎంతమంది గర్భిణీ స్త్రీలకు, శిశువులకు టీకాలు ఇస్తున్న విషయాలన్నీ పొందుపరిచి ప్రతి సెషన్‌లో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కుటుంబ నియంత్రణ శాశ్వత పద్ధతులలో భాగంగా మగవారికి వేసక్టమీ ఆపరేషన్ డిచ్‌పల్లి సామాజిక ఆసుపత్రిలో ఈనెల 30న శిబిరం ఉందన్నారు. ప్రతి ఆశా కార్యకర్త, ప్రతి ఆరోగ్య కార్యకర్త ఒక్కొక్కరిని తీసుకొని రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వైద్యాధికారి తెలిపారు. డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాలకు చెందినవారు వివరాలకు 9989947933 కి సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాల, ఆరోగ్య సిబ్బంది వెంకటరెడ్డి, ఆనంద్ ఎంహెచ్ హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు కుటుంబాల పరామర్శ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో లింగంపేట్ జెడ్పిటిసి సభ్యులు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. బాణపూర్ తాండ మాజీ సర్పంచ్ పీర్సింగ్ తల్లి, ఎక్కపల్లి మాజీ సర్పంచ్ సతీష్ గౌడ్ తాత, సజ్జనపల్లి మాజీ సర్పంచ్ పోచయ్య తల్లి చనిపోయినందున నేరుగా ఇంటింటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ జొన్నల రాజు, మాజీ వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, ఎదులు, దత్తాద్రి, మీరజ్, ఏంసి డైరెక్టర్‌లు పూల్‌సింగ్, డైరెక్టర్ లక్ష్మి నారాయణ, హరి సత్యం, సిద్దు, శివాలాల్, పర్వయ్య, లచ్చి రెడ్డి, సిద్ది రాములు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న దృశ్యం

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గల ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన గురువారం ప్రదర్శించారు. అధికారం చేపట్టిన కొంత సమయంలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఒక్కో ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ అందించిందని సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తూ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని కళాబృందం ద్వారా వినిపించారు. రమేష్ రావు ఆధ్వర్యంలో కళా ప్రదర్శన చేపట్టారు. కళాకారులు రాము, లక్ష్మీ నరసయ్య దేవయ్య, దివ్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ రావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.



కళా ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

బాల్యవివాహాల ప్రోత్సాహమూ నేరమే

నవతెలంగాణ-బోధన్/భిక్కనూర్/ఎల్లారెడ్డి/లింగంపేట్

బాల్య వివాహాలు చేసినా, వాటిని ప్రోత్సాహించినా చట్టరీత్యా నేరమేనని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఇంచార్జి సీడీపీఓ రాధిక అన్నారు. గురువారం మండలంలోని పెంటాఖుర్దు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్ వివాహ్ ముక్త్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ

భిక్కనూర్ : బాల్య వివాహాలను అడ్డుకట్ట వేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. నిర్ణీత వయసు వచ్చిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని బాల్య వివాహం చట్టరీత్యా నేరమని గ్రామాలలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని వైద్యాధికారి దివ్య సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజమణి, ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ, స్టాఫ్‌నర్స్ హరిత, ఫార్మసిస్ట్ స్వామి, హెల్త్ అసిస్టెంట్ సతీష్, ఆరోగ్య కార్యకర్త మాధవి, శ్యామల, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండల పరిధిలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశం మేరకు ఎల్లారెడ్డి మండల వైద్యాధికారి శరత్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు పాటు పడాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

లింగపేట్ : బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందని లింగంపేట్ మండల వైద్యాధికారిణి డాక్టర్ హిమ బిందు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది బాల్యవివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది ఫరీదా, ప్రదీప్, సుభాష్ తదితరులున్నారు.



లింగంపేట్ : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపిక కావడంతో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి దయానంద అభినందించారు. ఈ కార్యక్రమంలో హౌస్వెల్సి కిరణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ వెంకట్రాములు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన కాశీనాథ్ అనారోగ్యం కారణంగా మరణించారు. ఈ విషయాన్ని సొసైటీ చైర్మన్ రాజాగౌడ్ ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి తెలియజేయగా తక్షణమే మృతుడి కుటుంబానికి రాజాగౌడ్ ద్వారా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి గౌడ్, సుదర్శన్ గౌడ్, రవి, సురేష్, ప్రశాంత్, సంతోష్, యాదగిరి తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న చైర్మెన్

మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 134వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల పూల విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగారం మాట్లాడారు. పూలే ఆశయ సాధన కోసం మనమంతా ఉద్యమించవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతం సీతారాములు, విట్టల్, సందీప్, సాప శివరాములు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాత్మ జ్యోతి బాపూలే వర్ధంతిని పురస్కరించుకుని బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్‌పి) కామారెడ్డి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గల జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దీక్ష దివస్‌కు తరలిరావాలి

నవతెలంగాణ-తాడ్వాయి/ఎల్లారెడ్డి

నేడు బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన దీక్ష దివాస్ కార్యక్రమానికి హాజరు కావాలని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ముదాం నర్సింలు గురువారం తెలిపారు. ఈ సమావేశాన్ని కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్సీ కవిత, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ హాజరవుతారని, మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఎల్లారెడ్డి : కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సత్యా గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత రాష్ట్ర సమితి ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు సతీష్ కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ హాజరవుతారని తెలిపారు.

ఆదాయ కార్యక్రమాలు చేపట్టాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మహిళా సంఘాల సభ్యులు ఆదాయ కార్యక్రమాలు చేపట్టే విధంగా వారిని చైతన్యవంతం చేయాలని అడిషనల్ డిఆర్డిఓ మురళీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల ఐకెపి కార్యాలయంలో ఆయా గ్రామాల వీవోఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ డీపీఎం రవీంద్రావు, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్ తో పాటు సీసీలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని మద్దెల్ చెరువు గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు భీమ్‌సింగ్, సంగమేశ్వర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'చలో మేడ్చల్'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

డిసెంబర్ 1న వీఆర్వో, వీఆర్ఏల ఆత్మ గౌరవ ఆందోళన సభను ప్రతి వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వీఆర్వో, వీఆర్ఏల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆత్మగౌరవ ఆందోళన సభను జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా, షామిరిపేట్ మండలం, తూంకుంట గ్రామంలో మొగుల్ల వేంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సర్వే డాటాను నమోదు చేయాలి

ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని 30 గ్రామపంచాయతీలలో నిర్వహించిన సర్వే డాటాను నమోదు చేయాలని అధికారులకు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో డాటా ఎంట్రీ పనులు పరిశీలించారు. ప్రతి ఒక్క అంశాన్ని కచ్చితంగా తప్పుడు లేకుండా నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని డాటా ఎంట్రీ చేస్తున్న సిబ్బందికి ఎంపీడీవో ఆదేశించారు.

అమరవీరులకు ఘనంగా నివాళి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌క్యాంప్ గ్రామంలో 1955లో నిజాంషుగర్ ఫ్యాక్టరీకి కార్మికులకు, పోలీసులకు మధ్య జరిగిన ఉద్యమంలో ముగ్గురు కార్మికులు రాజయ్య, రామయ్య, రాములు పోలీస్ కాల్పుల్లో అమరులయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ నాయకులు, ఫ్యాక్టరీ కార్మికులు అమరవీర స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దూర్ సభ కార్మిక నాయకులు నర్సింలు గౌడ్, పుల్కా స్వామి, రమేష్, రాజు, షాబుద్దీన్, తాటిపాముల రాజు, దుకాణం శీను, సంజీవ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏ ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో వీవోఏల ఖాళీ పోస్టులకు దరఖా స్తులను ఆహ్వానిస్తు న్నట్టు ఏపీఎం చిన్నయ్య తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన వారు విద్యా అర్హతలు ఇంటర్మీడియట్ కలిగి, వివోఏలపై అవగాహన కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మండలంలోని నీలా, పేపర్‌మిల్, కళ్యాపూర్, నీలా క్యాంప్ గ్రామాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్టు వివరించారు. డ్వాక్రా గ్రూపులలో సభ్యత్వం కలిగి ఉండి, డాటా ఎంట్రీలు నమోదు చేసుకుని అర్హత కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఐకెపి సిసి శ్యామల, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం చిన్నయ్య

ట్యాబ్ ఎంట్రీలు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ)తో కలిసి ధాన్యం కొనుగోళ్లు, ట్యాబ్ ఎంట్రీలు, రైతులకు చెల్లింపు అంశాలపై కలెక్టర్ పౌరసరఫరాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యంను పరిశీలించి కొనుగోళ్లు చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం కాంటా చేసి సంబంధిత రైస్ మిల్లలకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల బ్యాంక్ ఖాతాలు, తదితర వివరాలను ట్యాబ్ ఎంట్రీలు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో ట్యాబ్ ఎంట్రీలు చేసిన తరువాత రైతులకు చెల్లింపులు జరుగుతాయని వివరించారు. ట్యాబ్ ఎంట్రీ వివరాలు నమోదు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీల పరిశీలనకు ఆయా మండల తహసీల్దార్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ వి.విక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమశిక్షణ నేర్పుతూ..

నవతెలంగాణ-బోధన్

మొక్కైవంగనిది మానైవంగునా అన్నారు పెద్దలు. అంటే చిన్నప్పుడే పిల్లలకు క్రమశిక్షణ నేర్పిస్తే వారు పెద్దయ్యే వరకు అదే క్రమశిక్షణ పాటిస్తారనేది సారాంశం. ఈ క్రమశిక్షణ అలవాటు కావాలంటే అది అంగన్వాడీలలోనే సాధ్యం. దానిని పాటిస్తూ చిన్నారులకు క్రమశిక్షణ అలవాటు చేస్తూ వారితో కలిసిపోయి విద్యా బుద్ధులు నేర్పుతున్నారు ఈ అంగన్వాడీ టీచర్. బోధన్ మండలం కొప్పర్గ గ్రామంలోని ఒకటో నెంబర్ అంగన్వాడీ టీచర్ అతియాబేగం అమ్మ వలే చిన్నారులకు లాలిస్తూ వారికి అక్షరాలు నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పిల్లలు ఎలా మెలగాలో తెలుపుతూ వారికి చిన్న చిన్న పదాలు నేర్పిస్తూ వారిని ఆకట్టుకుంటున్నారు. ఈ అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే వస్తువులు గర్భిణీలు, బాలింతలకు అందించి వారికి ఆరోగ్య సంబంధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు అంగన్వాడీ టీచర్ అతియాబేగం తెలిపారు. ఈ కేంద్రంలో 35 మంది చిన్నారులు రోజు హాజరవుతున్నారని తెలిపారు. చిన్నారులతో ఈ అంగన్వాడీ కేంద్రం నిరంతరం కళకళలాడుతోంది.



చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్

అవినీతి లేని పాలన చేశాం

- మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ ఎమ్మెల్యేగా గెలిచిన తోట లక్ష్మీకాంతరావు సంవత్సరం కాకముందే మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకాల్లో అవినీతికి పాల్పడి డబ్బులు తీసుకొని చైర్మన్ సీట్లు ఇచ్చారని సొంత కాంగ్రెస్ పార్టీ నాయకులే గాంధీభవన్ ముందు బైఠాయించి ఆరోపణలు చేస్తూ ఫిర్యాదులు చేశారని, నా 15 సంవత్సరాలపాటు ఎమ్మెల్యేగా జుక్కల్ నియోజకవర్గంలో అవినీతి లేని పాలన చేశానని మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. గురువారం బిచ్కుంద మండల కేంద్రంలోని తన నివాస గృహంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొడుతున్న వార్త అసత్యమని తాను ఎవరికీ కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదని జుక్కల్ నియోజకవర్గంలోని ప్రజలకు తాను ఎలాంటి వ్యక్తినో తెలుసునని నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుతో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదని తెలిపారు. నా జీవితం తెరిచిన పుస్తకమని 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని అన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

దీక్ష దివస్‌ను విజయవంతం చేయండి..

సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ ప్రజల కోసం కెసిఆర్ నిరాహార దీక్ష చేపట్టి ఢిల్లీ పీఠాన్ని కదిలించి ప్రత్యేక తెలంగాణ సాధించడం జరిగిందని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో సత్య గార్డెన్ లో నిర్వహిస్తున్న దీక్ష దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరావు దేశాయ్, సొసైటీ చైర్మన్ శ్రీహరి బాలాజీ, నాయకులు రామచందర్, బొమ్మల లక్ష్మణ్, హనుమాన్లు సేట్, రాజు, డాక్టర్ సంజు పటేల్, మహేష్ నాయకులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

నవతెలంగాణ-బోధన్

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ ఎంఈఓ నాగయ్య అన్నారు. గురువారం బోధన్ ఉప విద్యాధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. డిసెంబర్ 4న జరిగే నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సూర్యకుమార్, రత్నాకర్, ఆరీఫొద్దీన్, సీఆర్పీలు, కో-ఆర్డినేటర్ నాగేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు కౌశిక్ యాదవ్, ప్రీతి, కృషిత్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ రేణు కుమార్ తెలిపారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరంలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గాంధీభవన్‌లో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే


నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గురువారం గాంధీభవన్లో నిర్వహించిన సమావేశానికి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో త్వరలో జరగబోయే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలపై చర్చించారు.

పంచాయతీ కార్మికుడికి వీడీసీ ఆర్థికసాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట గ్రామపంచాయతీ కార్మికుడు సుద్దాల బాల్ నర్సు ప్రమాదవశాత్తు గుంతలో పడి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయనను పరామర్శించారు. వీడీసీ ఆధ్వర్యంలో రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు గాండ్ల ప్రవీణ్, పోతుల భాస్కర్ రెడ్డి, సాయిలు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



దాతల సహకారంతో వృద్ధాశ్రమం ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని గురువారం ప్రారంభించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన చిట్టీ మెళ్లి పద్మ-జగదీశ్వర్, పోసానిపేటకు చెందిన తంకరి కమల-రాజయ్య కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు రూ.25 లక్షలతో నిర్మించామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధితోపాటు, సామాజిక సేవ కార్యక్రమాలను ఆలయ కమిటీ ముందుండి నడిపిస్తుందని తెలిపారు. దాతలకు శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, అవినాష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-పిట్లం

కుటుంబ సర్వే డాటా ఎంట్రీ పనులను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే ఎంట్రీ పనులను వేగవంతం చేసి ఆ నివేదికలను ప్రభుత్వం విధించిన గడువులోపు ఉన్నతాధికారులకు నివేదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ నాగరాజు, పంచాయతీ సెక్రెటరీ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏబీవీపీ కామారెడ్డి టౌన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సమీర్ తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాసిరకం భోజనం అందించకుండా నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. అలాగే విద్యార్థులతో భోజనాన్ని ఏ విధంగా అందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు యోగేష్, సైభాష్, రాజు, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

30న రైతు పండుగ : ఏఎంసీ చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

ఈ నెల 30న రైతు పండుగ నిర్వహించనున్నట్టు మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ తెలిపారు. గురువారం మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరాం ఇటీవల కాలంలో మరణించారు. ఈ సందర్భంగా టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వినోద్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, వీడీసీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నిజాంసాగర్

మహ్మద్‌నగర్ మండలంలోని బుర్గుల్ గ్రామానికి చెందిన దుద్దే రామవ్వ ఇటీవలే టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీ తీసుకొని కొన్ని రోజుల క్రితం సాధారణ మరణం చెందడం ద్వారా నామిని కూతురు మంజులకు రూ.2,20,000 ఇన్సూరెన్స్ చెక్కును అందజేసినట్టు మేనేజర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ అనేది కుటుంబానికి ఒక భరోసా లాంటిదని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ అడ్వైజర్ శ్రీధర్, మేరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ స్థాయిలో అనేక రంగాల్లో సమాజ హిత, సంక్షేమ, ఆర్థిక, విద్యా, వైద్య రంగాలలో సహాయ సహకార అందించడంలో ముందుంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు పి.రాజనరసింహారెడ్డి తెలిపారు. గురువారం రోటరీ క్లబ్ అధ్యక్షులు అధ్యక్షతన రోటరీ క్లబ్ భవనంలో ఉచిత సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని పేద బాలికలకు ఏంపవరింగ్ గర్ల్ స్టూడెంట్స్ పథకంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్, వెల్లాన్ సంస్థల సంయుక్త సహకారంతో 5 సైకిల్‌లు వివిధ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ధనంజయ, శంకర్, నాగ భూషణం, సత్యం, సుధాకర్ రావు, వెంకటరమణ, బాపురెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని మాలతి ఇటీవల రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఫెరోస్ హైదర్ పేర్కొన్నారు. ఇటీవల నవీపేట్ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని 81 కేజీల బరువును ఎత్తి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థిని మాలతిని పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు, ఉపాధ్యాయ బృందం గురువారం అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, ప్రవీణ్, శంకర్, సలావుద్దీన్, ప్రతాప్, రాజేందర్, గంగాధర్, సురేష్, రాధా, స్వప్న, ఇంతియాజ్, జిబీరియా, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్


మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలకు చెందిన 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల 480 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నంద్యాల గంగ కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయుడు జాదవ్ గణేష్, సహాయ ప్రిన్సిపాల్ సుమన్, ప్రముఖ వ్యాఖ్యాత పద్యకవి, బి.వెంకట్, ఉపాధ్యాయులు సంతోష్, నరహరి ప్రసాద్, రాము, సమీరా మహమ్మదీ, గోవింద్, గంగాప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ ఎస్సైగా సుధాకర్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ఎస్సైగా సుధాకర్ గురువారం సాయంత్రం బాధ్యతలను చేపట్టారు. ఇదివరకు ఎస్ఐగా పనిచేసిన అరుణ్ కుమార్ ఇటీవల ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యారు. దీంతో ఆయన స్థానం ఖాళీగా ఉంది. కాగా నిజాంసాగర్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌కు లింగంపేట్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా బదిలీపై వచ్చారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | నవంబర్ 29, 2024 | www.navatelangana.com

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి

- కేసు నమోదు

నవతెలంగాణ-ఆర్మూర్


పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా నుండి హైదరాబాద్ వెళ్లే మార్గంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న పెర్కిట్ కు చెందిన మహమ్మద్ వహీద్‌ను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ గురువారం తెలిపారు. ఆయన వద్ద నుంచి (1-100) కేజీల ఎండు గంజాయి, పల్సర్ వాహనం, మొబైల్‌ను సాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్టు తెలిపారు. ఈ రూటు వాచ్ లో ఎక్సైజ్ ఎస్సై చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, సందీప్ ,శ్రీనివాస్, సాగర్ ,నరేష్, దేవిదాస్, సాయిబాబా పాల్గొన్నారు.

రంగోళి పోటీలు

నవతెలంగాణ-బాల్కొండ


ముగ్గులు వేసిన విద్యార్థినులు

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా 'ఎయిడ్స్' నియంత్రణ మండలి, వై ఆర్‌జికేర్ సంస్థ సంయుక్తంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం రంగోలి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 11 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ రంగోలి పోటీలో ప్రతిభ కనబరచిన మొదటి ముగ్గురికి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రశంస పత్రం అందజేస్తామని వైఆర్జికేర్ డి. ఆర్పి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, సీనియర్ ఉపాధ్యాయులు ఎం .ప్రశాంత్, ఉపాధాయ బృందం, వై ఆర్జీకేర్ బృందం పాల్గొన్నారు.

సమస్యలకు కేరాఫ్.. చిన్నాపూర్ గ్రామం


- రోడ్లు, డ్రైనేజీలు కరువు
- పంచాయతీకి వెళ్లాలంటే దారిలేని దుస్థితి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని చిన్నాపూర్ గ్రామం సమస్యలకు నిలయంగా ఉంది. కనీస వసతులు లేవు. కనీసం గ్రామపంచాయతీకి గ్రామస్తులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం గ్రామ సచివాలయానికి వెళ్లాలంటే కూడా పెద్ద కాలువను దాటుకుని వెళ్ళాలి. వృద్ధులు ఏదైనా సమస్య ఉంటే గ్రామపంచాయతీ కార్యదర్శికి చెప్పాలంటే ఆ కాలువ దాటుకుని వెళ్లడం వారితో సాధ్యం కాదు. గ్రామ సచివాలయానికి వెళ్లాలంటేనే ఇంత ఇబ్బందిగా ఉంటే ఈ గ్రామంలో డ్రైనేజీలు కనపడువు. అలాగే రోడ్లు కొంతవరకు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిని కూడా కనీసం బాగు చేసుకోకపోవడం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. ఆ గ్రామ స్పెషల్ ఆఫీసర్ అసలు ఉన్నారా.. అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్ ఉంటే, ఆ గ్రామానికి వెళ్లిఉంటే రోడ్డు బాగుచేయించేవారని గ్రామస్తులు అనుకుంటున్నారు. ఈ గ్రామం మండల కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంది. కానీ గ్రామంలోనికి వెళ్తే ఈ గ్రామం జిల్లా కేంద్రానికి ఏదో 100 కిలోమీటర్ల దూరంలో ఉంటే ఏ రకంగా ఉంటుందో ఆ గ్రామ పరిస్థితి ఆ రకంగా ఉంది. గత పాలకులు ఏం చేశారో ప్రస్తుతం ఉన్న స్పెషల్ ఆఫీసర్ గాని పంచాయతీ కార్యదర్శి వస్తున్నామా.. వెళ్తున్నామా అనే ధోరణిలోనే ఉన్నారు తప్ప ఇది తమ గ్రామం బాగు చేయాలి అనే ఉద్దేశం మాత్రం వారిలో ఏమాత్రం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


డ్రైనేజీలేక రోడ్లపై పారుతున్న మురికి నీరు


అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి

వారు వెళ్లేదారిలో కనీసం ఆ డ్రైనేజీ పైన ఒక పైప్ లాంటిది ఏర్పాటు చేసుకున్నా కూడా ఆ సమస్య నుండి బయటపడవచ్చు. అంతేకాకుండా ఆ సచివాలయంలోనే అంగన్వాడి కేంద్రం ఉంది. 22 మంది పిల్లలు ఆ కేంద్రానికి వెళుతుంటారు. పిల్లల కేంద్రానికి వెళ్లాలంటే కనీసం మెట్ల వసతి కూడా లేదు. కొంచెం అటు ఇటు అయినా చిన్నపిల్లలు కిందపడి గాయాల పాలవుతారని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆ కేంద్రానికి అంగన్వాడికేంద్రం అనే బోర్డు కూడా లేదు. ఇప్పటికైనా మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ అధికారి, స్పెషల్ ఆఫీసర్ ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామసమస్యలు గురించి ఒక నివేదిక తయారు చేసి శాసనసభ్యులకు అందజేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆ గ్రామ కార్యదర్శి గ్రామంపైన దృష్టి సారించాలని కోరుతున్నారు. నవతెలంగాణ ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కును నమోదు చేసుకోండి

- తహసిల్దార్ రమేష్

నవతెలంగాణ-ఆర్మూర్



ఎమ్మెల్సీ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు ఓటర్‌గా నమోదుకు మరో సారి అవకాశం ఇచ్చినట్లు ఆలూరు తహసిల్దార్ రమేష్ గురువారం తెలిపారు. నేటి నుండి డిసెంబర్ 9 వరకు గడువు ఉందని, ఉపాధ్యాయులు ఫామ్-19తో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, పాఠశాల, ఉద్యోగ గుర్తింపు కార్డు, ఆధార్ ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టభద్రులు ఫామ్-18 తో పాటు పాస్ పోర్టు సైజ్ ఫోటో, డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రజలను జత చేయాలన్నారు. ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు హక్కును తాసిల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

గ్రంథాలయనికి స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఆల్ఫోర్స్ డైరెక్టర్ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కేంద్ర, రాష్ట్ర పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ పాఠకులకోసం అందజేశామని, ఏదైనా మెటీరియల్ అవసరమనుకుంటే వెంటనే అందజేస్తానని తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు డిసెంబర్ 2024 నుండి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ పాఠకుల భవిష్యత్తు గురించి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేసి, డిసెంబర్ నెల నుంచి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేస్తున్నందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల ఆవరణలో కోతుల బెడద

- భయాందోళనలో విద్యార్థులు


పాఠశాల ఆవరణలోకి వచ్చిన కోతులు

నవతెలంగాణ-మెండోర

మెండోర మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైపోయింది. గ్రామంలో ఎక్కడ చూసినా విచ్చల విడిగా కోతులు తిరుగుతూ జనాలపైకి ఎగబడుతున్నాయి. గ్రామంలో రోడ్లపై తిరగడానికి కూడా జనాలు జంకుతున్నారు. గురువారం అయితే ఏకంగా పాఠశాల ఆవరణలో చొరబడి గుంపులుగా సంచరించాయి. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు భయాందోళన చెందారు. ఈ క్రమంలో పాఠశాల సిబ్బంది ఆ కోతులను తరిమేశారు. రోజూ కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులను కరిచే అవకాశం ఉందని విద్యార్థులు కోతుల బారిన పడకుండా గాయాలపాలు కాకముందే అధికారులు వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

మహనీయుల పార్కులో పరిశుభ్రత కరువు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


పార్కులో పడేసిన చెత్త

మహాత్మ జ్యోతిరావు బాపులే వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు జిల్లా కేంద్ర లోని అమరవీరుల పార్కు కు వెళ్లి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విగ్రహం వద్ద చెత్తాచెదరం తోపాటు కూరగాయల డబ్బాలు, థమ్సప్ సీసాలు, ఇతరత్రా సీసాలో దర్శనమిచ్చాయని నాయకులు, అధికారులకు సమాచారం అందించారు. అయినా వారినుండి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మహనీయుల వర్ధంతి, జయంతు లను ముందుగానే గుర్తుంచుకొని కనీసం అమరవీరుల పార్కులో శుభ్రతను పాటించాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ



లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మమతా బావయ్య కాంప్లెక్స్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 69 మందికి వైద్యురాలు ప్రవల్లిక కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అందే వెంకటగిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెసరర్ కటికె శ్రీనివాస్, సభ్యులు చౌటి కిషన్,చాకు లింగం పాల్గొన్నారు.

స్త్రీనిధి డబ్బుల స్టేట్‌మెంట్ ఉంది

- మెప్మా అధికారులు
- హమాల్‌వాడి బాలాజీ సమైక్య సమావేశం
- సమస్యను పరిష్కరించిన ఐద్వాకు ధన్యవాదాలు తెలిపిన మహిళలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హమాల్‌వాడీ బాలాజీ సమైక్యలో ఉన్న స్త్రీనిధి సమస్యపై ఐద్వా ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు స్పందించిన మెప్మా ఆఫీసర్లు, సీవోలు, ఆర్పీలు, స్త్రీనిధి మేనేజర్ కలిసి గురువారం సమావేశం నిర్వహించారని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత తెలిపారు. ఆర్పీ లేదనే కారణంతో స్త్రీనిధి డబ్బులు వసూలు చేయకపోవడంవల్ల స్త్రీనిధిలో లేనివారికి కూడా సమస్యగా మారిందని చెప్పారని అన్నారు. అలాగే స్త్రీనిధి డబ్బులు వసూలు చేసిన కొంతమందికి ఓచర్లు ఇవ్వక పోవడంతో సభ్యులు ఆందోళనకు గురయ్యారని తెలిపారన్నారు. కానీ తమ దగ్గర బ్యాంకు స్టేట్మెంట్ ఉందని, భయభ్రాంతులకు గురికావద్దని సభ్యులకు స్టేట్మెంట్ చూయించారని తెలిపారు. బుక్కులు లేని కారణంగా ఎవరు ఎంత అప్పు ఉన్నారో తెలియక స్త్రీనిధి వెనుక పడుతుందని చెప్పారని అన్నారు.


సమావేశంలో పాల్గొన్న సమైక్య సభ్యులు

ఇటీవల ఐద్వా ఇచ్చిన స్టేట్మెంట్‌లో 5 లక్షల రూపాయలు సీవోలు, ఆర్పిలు వసూలుచేసినట్టు ఎక్కడ కూడా లేదని తెలిపారు. కొన్ని పేపర్లవారు దాన్ని సృష్టించడం వల్ల ఆర్పీలు, సిఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. డబ్బులు కట్టించుకుని ఓచర్లు ఇవ్వలేదని, స్టేట్‌మెంట్ ఇచ్చామని, దీన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దని చెప్పారని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం సభ్యులందరూ తమ సమస్యను ఒక కొలిక్కి తీసుకొచ్చారని ఐద్వాకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ మళ్లీ ఒకసారి కూర్చొని స్త్రీనిధితో సంబంధం లేని పది గ్రూపులకు కచ్చితంగా ఐద్వా అండగా ఉండి లోన్లు వచ్చేటట్టు ప్రయత్నం చేయాలని కోరారన్నారు. కార్యక్రమానికి ఐద్వా నగర కార్యదర్శి వనజ హాజరయ్యారు.

జ్యోతిబాఫూలే ఆశయాలను అమలు చేయని పాలకులు

- సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్


నివాళ్లు అర్పిస్తున్న సిపిఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్‌సిటీ

జ్యోతిబాపూలే ఆశయాలను ఆచరణలో అమలు చేయని పాలకులు కలబొల్లి మాటలు చెపుతున్నారనీ సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పూలే 134 వర్ధంతిని గురువారం పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన ఉద్యమాలకు భీజం నాటిన ఉద్యమకారుడు, బడుగు బలహనవర్గాలకు ఆశాజ్యోతి పూలే అని అన్నారు. భారత దేశంలో మహిళలకు, నిమ్నజాతి కులాల వారి విద్యకు మార్గదర్శకుడని తెలిపారు. సత్యశోదక్ సమాజ్ ఉద్యమం ద్వార విద్య గొప్పతనాన్ని చాటిచెప్పిన మొదటి సంఘసంస్కర్తని, ఇల్లాలి చదువు - ఇంటికి వెలుగులి అనే సామాజిక భావనను పెంపొందించిన దార్శనికుడని అన్నారు. వితంతు పునర్వివాహం, వితంతు గర్భిణీ స్త్రీలకు అండగా బాలహత్య బందక్ స్థాపించి అండగా నిలిచిన నవయుగ సామాజిక వైతాళికుడని అన్నారు. వితంతు మహిళలకు, అనాధ శిశువుల కోసం సేవాసదనం స్థాపించి సేవలందించిన సమాజ సేవకుడు అని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కమిటి సభ్యులు ఇడగొట్టి సాయులు, కుల్దీప్ శర్మ, ఓంకార్, జాదవ్ రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో వినాయక నగర్‌లోగల పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా సెక్రెటరీ బత్తుల కిష్టయ్య, జిల్లా అధ్యక్షులు మాదాలే అజయ్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్త అని ఈ దేశంలో విద్యావ్యాప్తి గురించి నిరంతరం కృషి చేశారని, అనేక పాఠశాలలు స్థాపించి విద్యను అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆ రోజుల్లో స్త్రీలకు విద్య అవసరం లేదని మనువాదులు ఎంత వ్యతిరేకించిన పట్టు విడవకుండా తన భార్యకు విద్యను బోధించి ఒక ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది, స్త్రీలకు విద్యను అందించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. అస్పృశ్యత, అంటరానితనం రూపుమాపడానికి నిరంతరం కృషి చేసిన కృషివలుడని, వితంతువులకు నీడలేని స్త్రీలకు నీడనిచ్చిన మహనీయుడని, సత్యశోధక్ సంస్థను స్థాపించి విద్య అందించిన మహానుభావుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిహెచ్ వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు విజయ్ సాలంకే, జిల్లా ఉపాధ్యక్షులు సక్కి ప్రభాకర్, బిలీందర్ సింగ్ , తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా కమిటీ ఏర్పాటు చేస్తాం : ఎంఈవో

- మధ్యాహ్న భోజన ఏజెన్సీతో సమావేశం

నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గురుకులాలు, పాఠశాలల్లో భోజనం వికటించి ఫుడ్ పాయిజన్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీవారితో ఎంఈఓ బట్టు రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇస్తు మధ్యాహ్నం భోజనాన్ని నాణ్యంగా వండిపెట్టేలా, ఆహారం కలుషితం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ ప్రామాణిక నిర్వహణ విధి విధానాలను మండల విద్యాశాఖ అధికారి భోజన ఏజెన్సీలతో తెలిపారు. వంటసామాగ్రిలో ఏయే వస్తువులు ఎన్నిరోజులకోసారి తీసుకోవాలి, వాటిని ఎలా నిల్వచేయాలి కూరగాయల్ని ఉప్పుతో శుభ్రం చేయడం, బియ్యం కడిగిన తర్వాత కొంతసేపు నానపెట్టడం వంటి సూచనలు పాటించాలని, ఫుడ్ పాయిజన్ ఘటనలు తలెత్తకుండా.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలో పాఠశాల ఆహార భద్రత కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు ఇద్దరు ఉపాధ్యాయులు, హాస్టల్లో ప్రధానోపాధ్యాయులు సంబంధిత ప్రిన్సిపాల్ వార్డెన్ ఆహారభద్రత కమిటీలో సభ్యులుగా ఉంటారని అన్నారు. కమిటీ ప్రతి రోజు భోజనం వండడానికి ముందు స్టోర్ రూమ్, కిచెన్‌ని తనిఖీ చేస్తుందని, వంటగది గదిలోని, పరిశుభ్రత నాణ్యతను నిర్ధారించాలని అన్నారు. ఆహార నాణ్యతను తనిఖీ చేయడానికి భోజనం తయారీ తర్వాత వారు ఆహారాన్ని ముందు రుచి చూడాలని, ఆ తర్వాతే పిల్లలందరికీ అందించాలని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఈఓ బట్టు రాజేశ్వర్

నేడు దీక్షాదివస్

- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో భారీగా ఏర్పాట్లు
- గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీక్షాదివస్ కార్యక్రమాన్ని నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీక్షాదివస్ కోసం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో భారీగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీక్ష దివాస్ సందర్భంగా వినాయక్ నగర్ లో గల అమరవీరుల స్థూపానికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉదయం 10.30 నిమిషాలకు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తామని జీవన్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్ లో దీక్ష దీవాస్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీక్షాదివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ, మండల, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

20 మంది క్రీడాకారుల ఎంపిక

- ఫైనల్ డిసెంబర్ 5న

నవతెలంగాణ-ముప్కాల్


ఎంపికైన విద్యార్థులు

హైదరాబాద్‌లో వచ్చే నెల 7 నుండి 10 వరకు చేపట్టే 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ ఉమెన్స్ (బాలికల) పోటీలకు నిజామాబాద్ జిల్లా బాలికల కబడ్డీ జట్టును గురువారం సెలెక్షన్స్ చేసినట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి తెలిపారు. మొత్తం క్రీడాకాణులు 150 మంది పాల్గొనగా 20 మంది క్రీడాకారిణిలను ఎంపిక చేశామని అన్నారు. డిసెం బర్ 1 నుంచి 5 వరకు ముప్కాల్ భూదేవి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ప్రాపబుల్స్‌లో 20 మంది క్రీడాకారిణిల నుంచి 12 మందిని ఫైనల్ చేస్తామన్నారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు అంద్యాల లింగయ్య అధ్యక్షతన ఎంపిక విధానం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పిడిలు సురేందర్, రాజ్ కుమార్, మల్లేష్ గౌడ్, రాజేందర్, సురేష్, ప్రసాద్, అనురాధ, జ్యోతి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య, టి.సాయన్న, జి.గంగారాం, మధుకర్, సాయిలు, రాకేష్, సంజీవ్ థామస్, ముస్కు శ్రీను, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

- 6 తులాల బంగారం, ఆరువేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే పగలే చోరీ జరిగింది. సంజీవ్ రెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి నాయనమ్మ ఇటీవల మృతి చెందడంతో హెూమం చేయించేందుకు గురువారం ఆలయానికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. ఆరు తులాల బంగారం, రూ. 6వేల నగదు పోయినట్లు బాధితులు తెలిపారు. అనంతరం నాలుగో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే, కలెక్టర్ రాక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మండలంలోని తాండూర్ గ్రామంలో గల శ్రీ లింగ రామేశ్వర ఆలయంలో జరగ బోయే మహా రుద్ర హెూమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య గురువారం తెలిపారు.

కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ

నవతెలంగాణ-మోర్తాడ్


వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ అన్నారు. మండలంలోని వ్యవసాయ కార్మికులతో ర్యాలీగా నిర్వహిస్తూ తాసిల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12వేల జీవనభృతి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 50శాతం పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారని తెలంగాణలోని 55శాతం వ్యవసాయ కార్మికులు ఉన్న ప్రాంతంలోని కూలీలకు తక్షణమే నెలకు వెయ్యి చొప్పున సంవత్సరానికి 12వేలు ఇవ్వాలని అన్నారు. తక్షణమే వ్యవసాయ కూలీలకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తాసిల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ నాయకుల సురేష్, సత్యమ్మ అశోక్ ,దామోదర్, దయల్ సింగ్, పోశెట్టి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన భీంగల్ విద్యార్థులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

జడ్‌పిహెచ్‌ఎస్ భీంగల్ పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జెడ్ పి హెచ్ ఎస్ మెండోరాకు చెందిన విద్యార్థులు ఆర్తి, ప్రథమ బహుమతి, నివేదిత ద్వితీయ బహుమతి, సయ్యద్ ఇహాద్ తృతీయ బహుమతి పొందారు. వారికి ఎంఈఓ డి.స్వామి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వచ్చిన ఆర్తిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వినోద్ సాగర్, ఇమ్మాన్యూయల్, వినోద్, గంగా మోహన్, అజీమ్, రఘువస్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

నేడు డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

నేడు మండలానికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ... శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుండి ఇంద్రనగర్ తండా, భేల్య తండా, మర్యా తండా, దమ్మన్నపేట వరకు 8 కోట్లతో వేయనున్న డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని పాత మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సభ కార్యక్రమంలో మాట్లాడనున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు కాంగ్రెస్ పార్టీ అనుబంధం సంస్థల నాయకులు, ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు.

సామాజిక న్యాయం కోసం కృషి చేసినప్పుడే ప్రజలకు న్యాయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

సవానత్వం, సామాజిక న్యాయం కొరకు కృషి చేసినప్పుడే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. గురువారం జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సమానత్వం కొరకు పోరాటం చేసిన జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించడంతోనే సరిపోదని, ప్రభుత్వాలు సమాజంలో ఉన్న పేద, ధనిక వ్యత్యాసాలను తగ్గించినప్పుడే న్యాయం జరుగుతుందని అన్నారు. మనువాద సిద్ధాంతాన్ని అనుసరించి వివక్షత కొనసాగేలా బిజెపి ప్రభుత్వం విధానాలను అనుసరిస్తుందని తెలిపారు. మహిళల పట్ల చులకన భావం, వివక్ష, అట్టడుగు వర్గాలు అయిన దళితులు, బలహీన వర్గాల పట్ల నేటికీ వివక్ష కొనసాగుతుందన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచడానికి ఉపాధి అవకాశాలను పెంచటానికి సౌకర్యాలు, రాయితీలను కల్పించడానికి కృషి చేయకుండా కొద్దిమంది కార్పొరేట్ కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెట్టడం మూలంగా దేశంలో పేదరికం నిరుద్యోగం మరింత పెరిగి వివక్షత కొనసాగుతుందన్నారు. మనువాదం సూచించినట్టుగా మహిళల పట్ల ద్వేషం అణిచివేత పెరిగిపోతుందని, వీటికి వ్యతిరేకంగా ప్రజలందరూ సమైక్యంగా సమానత్వం సామాజిక న్యాయం కోసం పోరాటాల్లోకి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, నాయకులు నర్సయ్య, విగ్నేష్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం)నాయకులు

సామాజిక విప్లవ కారులు, సంఘ సంస్కర్త, బడుగుల విద్య ప్రదాత, బీసీల జాతి పిత మహాత్మజ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన ప్రతి ఒక్కరి గురించి పోరాడిన గొప్ప నాయకుడు మహాత్మ జ్యోతిబాపూలే అని పేర్కొన్నారు. సమాజం బాగుపడాలంటే మహిళా చైతన్యం ముఖ్యమని, మహిళా చైతన్యం విద్యతోనే సాధ్యమని గ్రహించి తన భార్యద్వారా మహిళలకు విద్యను నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, ధర్మనం దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, గురుచరణం, వాసం జయ, రుక్మిణి, సత్యనారాయణ, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా గురువారం సుభాష్‌నగర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ మాట్లాడుతూ.. కుల నిర్మూలన, సామాజిక సమస్యలపైన పోరాటం చేసిన మహనీయుడుని అన్నారు. కార్యక్రమంలో తుకారం అఫ్జల్, జగన్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి రావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య మహాత్మ జ్యోతి రావు పూలె వర్ధంతి సందర్భంగా జ్యోతి రావు పూలె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, కులవ్యవస్థ నిర్మూలనకు పూలే పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోడేటి శంకర్, సెక్రటరీ డి.అరుణ్ కుమార్,ట్రెజరర్ టీ. సుకేష్, జాయింట్ సెక్రటరీ ఎస్. చరణ్ కుమార్,ఏజీపీ నరసం చిన్నరెడ్డి,న్యాయవాదులు శ్రీధర్,జగన్,ప్రవీణ్, కృష్ణం రాజు,కీర్తి సాగర్,బాబాయ్యకిషన్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : నివాళ్లు అర్పిస్తున్న బార్ సభ్యులు

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

మహిళా సంఘాల ద్వారా రుణం పొంది జీవనోపాధి పెంచుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. దోమకొండ మండల ఐకేపీ కార్యాలయంలో మహిళా మండలం సమైక్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ సంఘంలో ఉన్న ప్రతి మహిళలకు మహిళా శక్తి కార్యక్రమాలు 100శాతం అమలు పరచాలన్నారు. అర్హత ఉన్న మహిళలను గ్రామ సంఘంలో చేర్పించాలని, జీవనోపాధిలో గేదెలు, పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలని సూచించారు. మండల సమాఖ్య ద్వారా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసి అమ్మ చేతి భోజనం అందించాలని తెలిపారు. బ్యాంకు లింకేజీ వందశాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం మహిళా శక్తి క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్, డీపీయం సుధాకర్, ఏపీఎం రాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని (సిబిసి ఎస్) బిఎ, బీ.కాం, బీఎస్సీ, బిబిఏ, బీసీఏ కోర్సులకు ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్‌కు, రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు మూడవ రోజు ప్రశాంతంగా జరిగాయి గురువారం ఉదయం జరిగిన పరిక్ష కేంద్రాలలో 7991 మంది విద్యార్థులకు 7480 మంది విద్యార్థులు హాజరయ్యారు(511) మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6561 మంది విద్యార్థులకు గాను 6030 హాజరయ్యారని 531 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్, సిఎస్ఐ డిగ్రీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

దీక్ష దివస్‌లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొనాలి

బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు నట్ట భోజన్న

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీఆర్ఎస్ నాయకులు దీక్ష దివస్ కార్యక్రమంలో పాల్గొనాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నట్ట భోజన్న గురువారం తెలిపారు. ఈనెల 29న శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29 న చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ స్ఫూర్తిని మరోమారు స్మరించుకునేలా నిర్వహించే "దీక్షా దివస్" కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జక్రాన్‌పల్లి మండలం నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల పక్కన ముండ్ల పొదలు తొలగింపు

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-జుక్కల్

'రోడ్ల పక్కన ముళ్ళ పొదలు' అనే శీర్షికన ఈ నెల 11న నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు స్పందించారు. వెంటనే ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ఎస్డిఎఫ్ నిధుల నుంచి నిధులు మంజూరు చేసి పనులను ప్రారం భించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించడంతో రోడ్డు పక్కన ముండ్ల పొదలను తొలగించారు.



ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

బస్సులోనే పీడీఎస్‌యు నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిజన రైతు కుటుంబాలను కలవడానికి బస్సుల్లో వెళ్తున్న పీడీఎస్‌యు నాయకులను వికారాబాద్ జిల్లా పరిధిలో పోలీసులు అరెస్టు చేశారని నాయకులు తెలిపారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా సిటి కంపెనీకి గిరిజన రైతుల భూములను అక్రమంగా లాక్కోవడం సరైనది కాదని పి.డి.ఎస్.యూ నాయకులు అన్నారు. నిజామాబాద్ నుండి వెళ్లిన పిడిఎస్‌యూ నాయకులను అరెస్టు చేసి వికారాబాద్ జిల్లా పరిగిలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారుల కంపెనీల కోసం గిరిజన రైతుల భూములను లాక్కోవడం సరైనది కాదని, రైతుల పైన క్రిమినల్ కేసులు నమోదుచేసి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. అరెస్ట్ చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని, గ్రామాల్లో పోలీస్ క్యాంపులని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు . అరెస్ట్ అయిన వారిలో పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారపు రాజేశ్వర్, సహాయ కార్యదర్శి జి.మస్తాన్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, నాయకులు మల్లేష్, బాను, శ్రీకాంత్, అశోక్, ఆసిఫ్, అక్షయ్,రవీందర్, రహీం, తదితరులు ఉన్నారు.

మండల అధికారులకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మండలాధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామపరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో గురువారం '75వ భారత రాజ్యాంగ దినోత్సవం' పురస్కరించుకుని మండల కేంద్రంలోని 'రైతు వేదిక' సభ ఆవరణలో మండలంలోని ఆయా శాఖల అధికారులకు చిరు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముప్కాల్ ఎంపీడీవో గా విధులు నిర్వర్తిస్తూ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ కు నివాళులు అర్పించారు. అనంతరం మండల అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు స్వేచ్ఛయుతగా తమ తమ విధినిర్వహణను కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామపరిరక్షణ సమితి కార్యదర్శి సంజీవ్ థామస్, సభ్యులు టి.సాయన్న, కట్ట మహేష్, గద్దల గంగారాం, జక్కుల రాము, జ్ఞానేశ్వర్, నర్సింగ్ దాస్, కల్లు స్వామి, కంచ విజయ్, నేర బాబూరావు, కట్ట గోపి, చెన్నూరు సురేష్, శంకర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో సర్వేను అడ్డుకోవడం సరికాదు

పివైఎల్, పిఓడబ్ల్యు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యు) ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్)లో నెలకొన్న సమస్యల గురించి సర్వే చేయడానికి వెళ్తే అక్కడి సిబ్బంది అడ్డుకున్నారని పివైఎల్, పిఓడబ్ల్యు నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా పీవైఎల్ నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎం. సాయిబాబా, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సిబ్బంది కొరత, పేషెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేస్తున్నా మన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రికి వెళితే అక్కడి సెక్యూరిటీ సిబ్బంది, అధికారులు, డాక్టర్లు కనీసం పేషంట్లతో మాట్లాడడాన్ని కూడా అడ్డుకోవడం, పోలీసులతో, సెక్యూరిటీ సిబ్బందితో దౌర్జన్యంగా బయటకు పంపడం బాధాకర మన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించకుండా, డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, సరియైన పరికరాలు లేకపోవడం, తాగునీరు అన్ని అంతస్తులలో అందుబాటులో ఉంచకపోవడం, పరిశుభ్రతను పాటించకపోవడం వంటి తీవ్ర సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. వైద్యంకోసం వచ్చిన ప్రజలకు కనీసం సరిపడా టాబ్లెట్లు లేవన్నారు. బయట కొనుక్కోమని సిబ్బంది చెప్పడం సిగ్గుచేటన్నారు. స్ట్రెచ్చర్, వీల్ చైర్లు సరిపడా లేవన్నారు. పేషంట్లను వారి బంధువులే నడిపించుకుంటూ తీసుకెళ్లే పరిస్థితి ఉందన్నారు. లిఫ్ట్ లు పనిచేయడం లేదన్నారు. సమస్యలకు నిలయంగా మారిన జిల్లా జనరల్ ఆసుపత్రిని కలెక్టర్, ప్రజా ప్రతినిధులు సందర్శించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించకుండా సమస్యలనూ తెలుసుకొనే అవకాశం ఇవ్వకుండా వ్యవహరించిన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఆసుపత్రి సమస్యలపై, ఆసుపత్రి అధికారులు సిబ్బంది వైఖరిపై ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు అమూల్య, రజిత, లలిత, పివైఎల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దండు మహేష్, ఉపాధ్యక్షులు మోహన్, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవైఎల్, పీఓడబ్ల్యు నాయకులు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం యువతి యువకులు అందరూ కృషి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. యాదగిరిరావు పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన గోడ పత్రాలను వైస్ ఛాన్సలర్ చాంబర్లో గురువారం ఆవిష్కరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టం జరగడంతో పాటు ప్రాణ నష్టం సంభవిస్తుందని తెలిపారు. గంజాయి, సిగరెట్, కల్తీకల్లుకు బానిసలు కాకూడదని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తు పరిణామాలు దారుణంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. దీనికోసం త్వరలో తెలంగాణ యూనివర్సిటీ లోఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలో యాంటీ డగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ అరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ, ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త

టీపీసీసీ అధ్యక్షుడికి కల్లుబట్టిల్లో కమీషన్లు

- ఇది ప్రజాపాలన కాదు రాక్షస పాలన
- దీక్ష దివస్ విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి
- షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రతి కల్లుబట్టి నుండి కమిషన్లు అందుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయోషా ఫాతిమ విమర్శించారు. రేవంత్‌రెడ్డి 23వ రాజు పులకేశీలో వడివేలులా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దీక్ష దివాస్ విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అబద్దాల కోరు పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోతున్నారని ఆక్షేపించారు. రైతులకు బోనస్ అనేది ఒక బోగస్ పథకమని వ్యాఖ్యానించారు. లగచర్ల నుంచి దిలావర్‌పూర్ వరకు రైతులకు అన్యాయమే జరుగుతోందని పేర్కొన్నారు. గురుకులాల్లో విద్యార్థులు విషాహారం తిని మృత్యువాత పడుతున్నా రన్నారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లాలోని కల్లు బట్టిల్లో కమిషన్లు ప్రారంభించారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వత్తాసు పలుకున్న అధికారుల పేర్లను పింక్ బుక్కులో ఎక్కిస్తున్నామని. రేవంత్ సోదరులు భూకబ్జా కోరులని, వారిభూదోపిడీకి అధికారులు వంత పాడుతున్నారని తెలిపారు. రైతులతో పెట్టుకున్నోళ్లెవరూ బాగుపడలేదని, బషీర్ బాగ్‌లో రైతులను చంపించిన చంద్రబాబు నాయుడికి పట్టిన గతే చిట్టినాయుడికీ పడుతుందన్నారు. గురుకులాల్లో 11నెలల్లో 48మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని, శైలజ అనే విద్యార్థిని మరణిస్తే ఆమె గ్రామానికి ఎవరూ వెళ్లకుండా నిర్బంధం అమలు చేశారని, ఎమ్మెల్యే కోవా లక్ష్మిని నిర్బంధించారని అన్నారు. ఆ పార్టీ నాయకులు ఈరావత్రి అనిల్ ఇసుక దందాలో, సుదర్శన్ రెడ్డి అనేక జిల్లాల్లో లిక్కర్ వ్యాపారంలో మునిగితేలుతున్నారని విమర్శించారు. ఆర్మూర్ లో కాంగ్రెస్ నాయకుడు వినయ్ రెడ్డి అవినీతికి పాల్పడుతున్నాడని, రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్ల అవినీతికి సిద్ధపడుతున్నారన్నారు. ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని, తనతో పాటు నిజామాబాద్ నగర మేయర్ భర్తపై అక్రమంగా కేసులు పెడుతున్నారని తెలిపారు. 11నెలల్లో 12వందలకు పైగా కేసులు నమోదయ్యాయి. అధికారులు అతి చేస్తున్నారని వారి పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని అన్నారు. వచ్చేది మా ప్రభుత్వమే తప్పు చేసిన వారిని ఎక్కడున్నా పట్టుకొని వడ్డీతో సహా చెల్లిస్తాం అని ఆయన హెచ్చరించారు.

ఐదువేల మందితో దీక్షా దివస్.

జిల్లాలో ఐదువేల మందితో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. దీక్షా దివస్‌కు నాయకులు, కార్యకర్తలు, తెలంగాణవాదులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు నేతలు రాంకిషన్ రావు, ఠాకూర్ సుజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి